# జాతీయ పౌరసత్వ రిజిస్టర్(ఎన్ఆర్సి) రద్దుచేయాలి

అలోక్ ముఖర్జీ

**జాతీయ** పౌరసత్వ రిజిస్టర్(ఎన్ఆర్సి) అస్సామ్‌లో తన ప్రాథమిక జాబితాను ప్రచురించగా, 40 లక్షలమందికి పైగా ప్రజలపేర్లు అందులో నమోదు కాలేదు. కేంద్రంలోను, అదేవిధంగా అస్సామ్‌లోనూ అధికారంలోనున్న పాలకులు దురుద్దేశ్యంతోనే ఈ విధంగా చేశారని, దీనిని వ్యతిరేకిస్తూ నిరసన గళాలు వెల్లువెత్తుతున్నాయి. 40 లక్షలమంది భారత ప్రజానీకాన్ని ఎన్ఆర్సి ఈ దేశం వారుకాదని ప్రకటించింది. పుండుమీద కారం చల్లినట్లుగా వారంతా భారతీయులేనని నిరూపించుకోవటానికి, తమ అభ్యంతరం తెలుపుతూ దరఖాస్తు చేసుకోవటానికి ప్రభుత్వం మరో 'అవకాశం' కల్పించింది. ఈ 40 లక్షలమంది ఎవరు? వీరిలో అత్యధికులు బెంగాలీలు; అలాగే ఝార్ఖండ్, బీహార్ రాష్ట్రాల వాసులతోపాటు నేపాలుకు చెందిన వారు కూడా వున్నారు. ఈ 40 లక్షలమందిలో 32 లక్షలమంది పైగా ముస్లిములే వున్నారు. ప్రతిపక్ష పార్టీలేగాక, విప్లవ శిబిరానికి చెందిన అనేకమంది రాజకీయ నాయకులు చెబుతున్నట్లుగా ఇదంతా అకస్మాత్తుగా జరిగిన పరిణామం కాదు.

## అస్సాం కల్లోలానికి మూలాలు

"విదేశీయులు" మరియు లేదా "బాహ్యాశక్తుల"కు వ్యతిరేకంగా అస్సామ్ గణపరిషత్(ఏజిపి), ప్రాంతా పరిషత్(పిపి)ల నాయకత్వంలో 1983 కాలంలో అస్సామీయులలోని కొందరు ఉన్మాదం తలకెక్కించుకున్న వారు తమకు తాము సాయుధులై అస్సామ్ ఉద్యమం నడపటంలోనే దీనికి మూలాలను చూడవచ్చు. అస్సామ్ నుండి "విదేశీయులు" లేదా "బాహ్యాశక్తులను" బయటకు పారద్రోలాల్సిందిగా కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ మొదట ఈ ఉద్యమం ప్రారంభమైంది. ఆ తర్వాత వారు అస్సామీయేతరులపై దాడులు ప్రారంభించారు. 1983 సెప్టెంబర్‌లో అస్సామ్‌లో ఘోరమైన మారణకాండ జరిగింది. నెల్లీకి చెందిన రెండు ఇరుగుపొరుగు గ్రామాలలో ఒకేరోజులో మత మైనారిటీలైన, భాషాపరంగా అల్పసంఖ్యాకులైన 3వేలమంది ఊచకోతకు గురయ్యారు. నయాఖోలీ లేదా పంజాబ్‌లలో జరిగిన మారణకాండలతో కూడా దీనిని పోల్చజాలనంత దారుణాన్ని భారతదేశం వీక్షించింది. ఇలాంటి ఓ ఘోరమైన దుర్ఘటన జరగబోతోందని పాలక నాయకులు ముందుగా తెలిసినప్పటికీ, నోరుమెదపకుండా వుండి మౌన ప్రేక్షకులుగా దానిని జరగనిచ్చారు.

అయితే ఉన్మాదులు ఆ ఘటనతోనే సంతృప్తి చెందలేదు. హత్యలు, దోపిడీలు, భయోత్పాతం సృష్టించటం కొనసాగాయి. తమ రాజకీయ ప్రయోజనాలకోసం కాంగ్రెస్, బిజెపిలు రెండూ ఈ ఉన్మాదచర్యలను పురికొల్పాయి. ఈ తరహా విచక్షణా రహిత హత్యలను కొనసాగించేందుకు 'ఉల్ఫా' ఏర్పడింది. అస్సామీయులలోని కనీస ప్రజాస్వామిక గొంతులను కూడా వదలకుండా ఈ హంతకులు హత్యచేశారు. ఈ ఉన్మాద చర్యలను వ్యతిరేకించిన డిబ్రూఘర్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి నాయకుడు సౌరభ్ బోరాను ఆ ప్రాంగణంలోనే హత్యచేశారు. అలాంటి హత్యలు పదులసంఖ్యలో జరిగాయి.

## అస్సామ్‌లోని యువకులను ఈ వైపు నడిపించిన వాస్తవిక అంశాలేమిటి?

అస్సామ్ రాష్ట్రం అనేక జాతుల, తెగల సమాహారమేగాక భిన్నమైన భాషలు, మతాలు కలిగివుండి కేంద్రం ఆధ్వర్యంలో అభివృద్ధికి నోచు కోకుండా వెనుకబాటుకు గురై వుంది. చదువుకున్న అస్సామ్ యువకులు సైతం తీవ్రమైన నిరుద్యోగ సమస్యను ఎదుర్కొన్నారు. పైగా బ్రహ్మపుత్రానది పరివాహక ప్రాంతంలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకునే చర్యలు చేపట్టలేదు. బ్రిటిష్ పరిపాలనా కాలంలో నాటి బెంగాల్‌కు చెందిన ప్రాంతంనుండి (ప్రస్తుత బంగ్లాదేశ్‌కు చెందిన మైమమ్‌సింగ్ ప్రాంతంనుండి) పెద్దసంఖ్యలో ముస్లిము రైతులను తీసుకువచ్చి, అటవీ ప్రాంతంగావున్న బ్రహ్మపుత్ర లోయలో వారిచే వ్యవసాయం చేయించారు. నీటి వనరులున్న ప్రదేశాలలో వ్యవసాయం చేయటంలో వీరంతా నైపుణ్యం కలవారు. 50 సం॥ల కాలవ్యవధి లోనే ఈ ప్రాంతం అస్సామ్ రాష్ట్ర ధాన్యాగారంగా పేరొందింది. కనుక, ఎప్పుడైతే నిరుద్యోగం ఆందోళనకర స్థితికి చేరిందో, అస్సామ్‌లో పుట్టి పెరిగిన పిల్లలు తాము వ్యవసాయరంగంలోకి కూడా ప్రవేశించలేమని భావించారు. కనుక రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై తమ ఆధిపత్యం కావాలని చదువుకున్న యువకులు కోరుకున్నారు. అదే సమయంలో, పెట్టుబడి కొరత కారణంగా, అస్సామ్ ప్రాంత బూర్జువావర్గం సరిగా పెంపొందలేదు. తేయాకు తోటల యజమానులలో అత్యధికులు విదేశీయులు (బ్రిటిష్‌వారు), లేదా అస్సామ్ బయటి ప్రాంతం నుండి వచ్చినవారే. కనుక కేవలం ప్రభుత్వ కాంట్రాక్టులపై ఆధారపడ గలిగే చిన్నపాటి మధ్యతరగతి వర్గం అభివృద్ధి చెంది, రాష్ట్ర ఖజానాను భారీగా దోచుకున్నారు. ప్రధానంగా వీరే యువజనులను ప్రేరేపించి అస్సామ్ ఆందోళనను ముందుకు తెచ్చారు.

వీరిని నడిపించటంలో కాంగ్రెస్, బిజెపిలు రెండూ వున్నాయి. డిమాండ్లపై కూడా వారు తేడా చూపారు. కాంగ్రెస్‌చే ప్రేరేపితమైన ఆందోళన కారులు బెంగాలీ హిందువులను, నేపాలీలను ప్రధానంగా 'బాహ్య శక్తులు'గా పేర్కొంటూ వారిని బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆ సమయానికి ఈ బెంగాలీ హిందువులు, నేపాలీలలో అత్యధికులు పార్లమెంటరీ లేదా విప్లవకర వామపక్షాలవైపు మొగ్గుచూపుతున్న వారుగా వున్నారు. బిజెపిచే ప్రేరేపితం చేయబడిన ఆందోళనకారులు, హిందు–ముస్లిము విభజనను ముందుపెట్టి, "విదేశీయులను" ప్రధానంగా బెంగాలీ ముస్లిములను బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

కనుక, భస్మాసురుడిని ఎప్పుడైతే ముందుకు తెచ్చారో, ఇక దానిని ఆపటం ఎవరితరమూ కాదు. నెలల తరబడి హత్యాకాండ, దోపిడీ, గృహ దహనాలు కొనసాగాయి. ఈ కాలంలో ఇందిరా గాంధీ మరణంతో కాంగ్రెస్‌పార్టీ ఈ ఆందోళనపై తన పట్టును కోల్పోయింది. 1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం అస్సామ్ ఉద్యమంలోని నాయకులతో "అస్సామ్ ఒప్పందం"పై సంతకాలు చేసింది.

**అస్సామ్ ఒప్పందం-కలిగించిన మరింత గందరగోళం**

ఈ ఒప్పందం సారాంశమేమంటే, అస్సామ్ లోని విదేశీయులు లేదా చొరబాటుదారులను కనుగొనటమే. దీనిలో మొదటి అడుగుగా అస్సామ్‌లోని ఓటర్ల జాబితాను పునఃపరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో పౌరులంతా తమ నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించాలని కోరారు. ఏ చిన్నపాటి పొరపాటు లేదా లోపం జరిగినా ఆ ఓటరు 'అనుమానాస్పదుడి'గా గుర్తింపబడతాడు. ఇలాంటి అనుమానాస్పద ఓటర్లకోసం 'డి-ఓటరు' అనే కొత్త పదాన్ని వాడటం ప్రారంభించారు. ఎన్నో తరాలక్రితం తేయాకు తోటల్లోకి కూలీలుగా వచ్చిన తేయాకు కార్మికులు, బెంగాలీ మూలానికి చెందిన హిందూ, ముస్లిము పేద రైతాంగమంతా ఈ చర్యల కారణంగా నిజమైన బాధితులుగా వున్నారు. వారికి భూమిపై సక్రమమైన హక్కులు లేవు. అలాగే నివాస ధృవీకరణకు సంబంధించిన ఇతర సాక్ష్యాలు కూడా లేవు. పైగా ఆ కాందిశీకులంతా భారత విభజన కారణంగా సరిహద్దును దాటివచ్చి ఒక శిబిరం నుండి మరో శిబిరానికి మారుతూ తరతరాలుగా అక్కడే నివశిస్తున్న పేదవారు. ఆ సమయంలో అధికారులు ఇచ్చిన గుర్తింపు పత్రాలను వీరిలో అత్యధికులు పోగొట్టుకున్నారు. కాగా, దేశ పశ్చిమ ప్రాంతంనుండి వచ్చిన వ్యాపారస్థులవద్ద మాత్రం ఈ పత్రాలు పక్కాగా వున్నాయి. వాస్తవానికి కొందరు వ్యాపారులలో అనుమానించదగిన వ్యక్తులు కూడా అధికారులను లోబరుచుకుని తమ గుర్తింపు పత్రాలను తెలివిగా పక్కాగా ఏర్పాటు చేసుకో గలిగారు కూడా.

ఏమైనా, అధికసంఖ్యలో ప్రజలను డి- ఓటర్లుగా జాబితాలో పేర్కొనటంద్వారా, అస్సామ్‌లో ఓ స్థిరమైన భూమికను సృష్టించగలిగానని కాంగ్రెస్ భావించింది. అయితే ఉన్మాదులతో చేసుకొనే అన్యాయమైన అలాంటి వ్యవహారాలు ఓ శాశ్వత పరిష్కారాన్ని సాధించలేవు. ప్రత్యేకించి, దేశంలో మతతత్వ నినాదంతో బిజెపి వంటి పార్టీ ఉనికిలో వుండగా ఇది సాధ్యం కాదు.

**బిజెపి నిర్వాకం-చట్టసవరణ**

టిఎంసి వంటి తన మిత్రులతో కలసి బిజెపి ఓ స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిన దశలో, అది మరో కొత్త తరహాలో యోచన చేసింది. 2003 సం॥లో అది పౌరసత్వ చట్టంలో సవరణలు చేసింది. ఆ సవరణలలో రెండు ప్రధానమైన అంశాలున్నాయి. ఈ చట్టంలోని పేరా 2(i)(b)లో 'చట్టవిరుద్ధ వలసదారుని' గురించి నిర్వచించారు. **1.**భారతదేశంలోకి ప్రవేశించిన విదేశీయుడై వుండి, ఆ వ్యక్తికి సక్రమమైన పాస్‌పోర్టు లేదా ప్రయాణ పత్రం లేదా చట్టంలో నిర్దేశితమైన ఎలాంటి అధికారిక గుర్తింపులేకపోయినట్లయితే ఆ వ్యక్తిని "చట్ట విరుద్ధ వలసదారుని"గా పరిగణిస్తారు.

**2.** భారతదేశంలోకి ప్రవేశించిన విదేశీయుడై వుండి ఆ వ్యక్తి సక్రమమైన పాస్‌పోర్టు లేదా ప్రయాణపత్రం లేదా చట్టంలో నిర్దేశితమైన విధంగా అధికారిక గుర్తింపు పత్రం వున్నప్పటికీ, ఆ పత్రంలో పేర్కొన్న సమయం దాటి భారత భూభాగంలో నివశిస్తున్నట్లయితే ఆ వ్యక్తిని 'చట్టవిరుద్ధ వలసదారు'గా పరిగణిస్తారు.

దీనితో మరో సమస్య తలెత్తింది. విభజనకు ముందు నాటి పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రాంతాలనుండి భారతదేశానికి వలసవచ్చిన వారు భారతదేశ పౌరులుగా పరిగణించబడతారని భారత రాజ్యాంగం ప్రారంభం సందర్భంగా పేర్కొన్నారు. అయితే ఆ వ్యక్తి 1948 జులై 18కి ముందు వలసవచ్చి వుండాలి. ఆనాటి నుండి భారత భూభాగంలో సాధారణంగా నివసిస్తూ వుండాలి.

అయితే దేశవిభజన తదనంతరం పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్‌తో సహా) నుండి నిరంతరాయంగా ప్రవేశాలు జరిగాయి. కొన్ని సంవత్సరాల తర్వాత 1965 నుండి 1971 నాటికి వీరొక పెద్ద సంఖ్యకు చేరుకున్నారు. వీరిలో అత్యధికులు సక్రమ పాస్‌పోర్టు లేదా సక్రమ ప్రయాణ పత్రాన్ని కలిగివుండి సరిహద్దు దాటినవారు కాదు. కనుక, ప్రవేశాలకు ఆఖరు తేదీని అనేక పర్యాయాలు పొడిగించారు. అయితే ఏ అధికారీ దీని గురించి పట్టించుకోలేదు.

సంబంధితులైన వారందరికీ విషయం తెలిసే సరికి ఏమి జరిగింది? ముంబైలో పనిచేస్తున్న యువకులు, వీరిలో అత్యధికులు ముస్లిములు. వీరందరినీ కట్టగట్టి పశ్చిమబెంగాల్‌కు, అంతిమంగా భారతదేశం నుండి గెంటివేస్తామనే పరిస్థితి వచ్చింది. చివరకు ఆ పిల్లలు హౌరాజిల్లా డోమ్‌జూర్ గ్రామానికి చెందినవారని కనుగొన్నారు. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ఆ చట్ట సవరణ తర్వాత కొద్ది సంవత్సరాలు ప్రతినెలా అనేకమంది యువజనులకు సంబంధించిన రెండు లేదా మూడు అలాంటి సంఘటనలు జరుగుతూ వచ్చాయి. వారందరినీ 'చట్ట విరుద్ధ వలసదారులు'గా కనుగొంటూనే వున్నారు.

జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌ను నిర్వహించటం, రెండవ ప్రాముఖ్యతగల అంశం. ఇప్పటిదాకా, నమోదు చేసుకోవటంద్వారా పౌరులుగా గుర్తింపు పొందాలనుకునే వారికి రిజిస్ట్రార్ ఒకరు వుండేవారు. వీరి కార్యాలయం ఢిల్లీలో వుంది. చట్టవిరుద్ధ చొరబాటుదారులుగా ముద్రవేస్తారేమోననే భయం వున్నవారు మినహా మిగతా వారెవరూ దీనినంత సీరియస్‌గా తీసుకోరు. అయితే వారిలో 90 శాతం మంది అస్సామ్‌లోని మారుమూల గ్రామాలనుండి ఢిల్లీవరకు ప్రయాణంచేసి, రిజిస్ట్రార్ కార్యాలయం చేరుకొని, పౌరసత్వంకోసం తమ పేరును నమోదు చేసుకొని, దానికి తగిన ఆధారాలన్నీ సమర్పించ గలిగిన స్థోమతగల వారు కాదు.

2003లో పార్లమెంటు ఉభయ సభలూ పౌరసత్వ చట్టానికి సవరణల బిల్లును ఎలాంటి వ్యతిరేకత లేకుండానే ఆమోదించాయి. వాస్తవం చెప్పాలంటే, పాకిస్తాన్ లేదా బంగ్లాదేశ్ వెళ్ళవలసిన హిందూ వలసదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పనిసరిగా

పరగణలోకి తీసుకుంటామని రాజ్యసభలో నాటి హోంమంత్రి ఎల్.కె.అద్వానీ హామీ ఇచ్చాడు. అయితే చట్టం తుదిరూపం తీసుకునే సమయంలో ఏవిధమైన మార్పు చేయలేదు. మమతాబెనర్జీ ఆనాడు కేంద్రక్యాబినెట్ మంత్రి అనే విషయం గుర్తుంచుకోవాలి.

**మరో పర్యాయం చట్టసవరణ**

ఏమైనా, మొదటి చట్ట సవరణలపట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. వేలాదిమంది ప్రజలు న్యూఢిల్లీలో బైఠాయించి వారంరోజులపైగా ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ తాను అధికారంలోకి వస్తే చట్టంలో మార్పుచేస్తానని హామీ ఇచ్చింది. కానీ ఏమీ చేయలేదు. ఈ అంశంపై కూడా మతతత్వ రాజకీయాలు చేయగలుగుతానని బిజెపి భావించింది. కనుక, 2016లో మరో సవరణ తీసుకొచ్చింది. దీని ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్ లేదా ఆఫ్ఘనిస్థాన్ దేశాలనుండి వలసవచ్చిన హిందువులు, జైనులు, పార్శీలు చట్టవిరుద్ధ వలస దారులుగా పరిగణించబడరు. ఇక్కడ మరోమారు లౌకిక విధానం అవహేళనకు గురైంది. ఎన్‌డిఏ కూటమి పార్టీలేకాక అన్ని పార్లమెంటరీ పార్టీలూ, ఇతర పార్టీలు ఈ సవరణకు ఓటేశాయి. చట్టవిరుద్ధ వలసదారులుగా పరిగణించబడని, అలాగే పౌరులుగా కూడా గుర్తించబడని వారి(ముస్లిములు) వాస్తవిక స్థితి ఏమిటని కనీసం ప్రశ్నించిన వారు కూడా లేకపోయారు.

ఈ నేపథ్యంలో అస్సామ్‌లో డి–ఓటర్లు మరియు పౌరసత్వం సమస్యపై సుప్రీంకోర్టులో విచారణ జరిగి జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌కు తుది రూపమివ్వవలసిందిగా ఆదేశించింది.

ఆ చట్టానికి సవరణలు తేవడంలో బిజెపి ఉద్దేశ్యాలు ఏమిటనేది ఇప్పుడు సుస్పష్టమే. 2017 నాటికి అస్సామ్ జనాభా 3 కోట్ల 30 లక్షలు కాగా, దీనిలో 40 లక్షలమంది ప్రజల పేర్లు జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌లో లేవు. అంటే 12 శాతంపైగా ప్రజలు రిజిస్టర్ బయట ఉంచబడ్డారు. మరింత వివరాల్లోకి పోతే ఈ 40 లక్షలమందిలో దాదాపు 30 లక్షలమంది బెంగాలీ హిందువులు, ముస్లిములు వున్నారు. మిగతా 10 లక్షల మందిలో ఝూర్ఖండ్ వాసులు, రాజవంశీయులు, నేపాలీయులు, బీహారీలు వున్నారు.

ఇదే అంతిమ జాబితా కాదని కేంద్రప్రభుత్వం ప్రకటిస్తోంది. ఇంకా అభ్యంతరాలకు, దరఖాస్తులకు అవకాశాలున్నాయి. పైగా ఎవరినీ గెంటివేయలేదు. (వాస్తవానికి కేంద్రప్రభుత్వం అలా చేయలేదు కూడా. ఎందుకంటే, బంగ్లాదేశ్ ప్రభుత్వం వారిని తమ దేశంలోకి ప్రవేశింపనీయదు) వారందరినీ ప్రత్యేక శిబిరాలలో వుంచుతారు. ఈ 40 లక్షల చొరబాటుదారులందరినీ దేశంనుండి తరిమి వేస్తామని బిజెపి అధ్యక్షుడు మాటల పిడుగులు కురిపిస్తున్నాడు.

ఈవిధంగా ప్రజలను ప్రత్యేకించి ముస్లిములను భీతావహుల్ని చేసే పరిస్థితిని సృష్టించారు. నిర్బంధ శిబిరాలలోకి తమను గొనిపోతారని, భారత పౌరులుగా తమకున్న హక్కులన్నీ కోల్పోవలసి వస్తుందని వారంతా భయపడుతున్నారు.

**ఎన్‌ఆర్‌సి కాదు నూతన కుట్రపూరిత విభజన**

వాస్తవానికి జాతీయ పౌరుల రిజిస్టర్‌గా పిలవబడేది, మతతత్వ రాజకీయాలతో నూతన కుట్రపూరిత పునర్విభజనగా రూపొందింది. ఈ పరిస్థితిలో మాతృభూమి అంటే కేవలం భౌగోళిక ప్రదేశం మాత్రమే కాదని, ప్రజలకు ప్రతి రూపమని భావించే ప్రజాస్వామికవాదులు, దేశభక్తులంతా జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌ను రద్దుచేయమని; పౌరసత్వ చట్టానికి 2003, 2016లో చేసిన సవరణలు రద్దుచేయాలని డిమాండ్ చేయాలి.

మనదేశంలోకి అదుపులేకుండా ఇతర దేశస్థులను ప్రవేశింపనీయబోమని కొందరు భావించవచ్చు. ఈ విధమైన చట్టవిరుద్ధ చొరబాట్లను నిరోధించటానికి ఎన్‌ఆర్‌సి జవాబు కాదు. సరిహద్దు భద్రతా ఏర్పాట్లు విఫలమైనప్పటికీ అనేక ప్రభుత్వ సంస్థలు, ఎన్నికైన ప్రతినిధులు ఈ సమస్యను పరిష్కరించగలుగుతారు. కొందరు ప్రజలను దేశాన్నుండి వెళ్ళగొట్టడానికి రూపొందించబడిన సంస్థ ఎన్‌ఆర్‌సి. మరికొంతమంది ఇది సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం జరుగుతున్నదని వాదిస్తున్నారు. 2009లో సుప్రీంకోర్టు ఆదేశమేమైనా వుందా అని వారిని ప్రశ్నిద్దాం. సుప్రీంకోర్టు ఆదేశం లేకుండానే ఆనాడు జాబితా రూపొందించే పని ప్రారంభమైంది. దీనికి నిరసనగా బార్పేట జిల్లాలో వెల్లువెత్తిన ప్రజల ఆందోళనలపై కాల్పులు జరిపి అనేకమందిని చంపివేశారు.

పార్లమెంటరీ పార్టీల ముఖాలన్నీ వెల్లడయ్యాయి. కాంగ్రెస్ నుండి టిఎంసి, సిపిఐ నుండి సిపిఎంల వరకు వారి అవగాహనలన్నీ తేటతెల్లమయ్యాయి. ఎన్‌ఆర్‌సి రద్దుచేయాలనే డిమాండ్‌ను పున రుద్ఘాటించాలి. 2003, 2016లో పౌరసత్వ చట్టానికి చేసిన సవరణలను రద్దుచేయాలి.

oooo